క్లుప్తంగా

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు



గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న క్రయ విక్రయదారులు

చిల్లకూరు : ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రాంతాలను బట్టి 20 నుంచి 50 శాతం చార్జీలు పెరగనున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై అధిక భారం పడనుంది. ఈ క్రమంలో ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు సిద్ధపడ్డారు. దీంతో గూడూరు, కోట పట్టణాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. రాష్ట్ర మంతటా ఒకేసారి అధికంగా రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రయత్నించడంతో సర్వర్లు మొరాయించాయి. అధికారులు, వినియోగదారులకు తిప్పలు తప్పలేదు. కార్యాలయంలో రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

చేపల చెరువుకు వేలం పాటలు

చిల్లకూరు : మండలంలోని బూదనం చెరువులో చేపలు పట్టుకునే హక్కుకు సంబంధించిన వేలం పాటలను శుక్రవారం బూదనం పంచాయతీ కార్యలయం వద్ద నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ సిరాజ్ మాట్లాడుతూ ఈ ఏడాది చెరువులో చేప పిల్లలను వదిలి పెద్దవయ్యాయక వాటిని పట్టుకుని విక్రయించుకునేందుకు అవకాశం కల్పిస్తూ వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రూ. 2.65 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి




గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

రాపూరు: పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పశుసంవర్ధక శాఖ ఏడీ అనీల్‌కుమార్, పశువైద్యురాలు సుప్రజ తెలిపారు. మండలంలోని సైదాదుపల్లిలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాల్లో 2,015 పశువులు, 1,280 దూడలు, 6,815 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించామని తెలిపారు. 13,700 గొర్రెలకు టీకాలు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమణయ్య, వెంకటరెడ్డి, బాబు, పెంచలరెడ్డి, చంద్రశేఖర్, చెంచురావు, పవన్‌కుమార్, శ్రీదేవి, మహేంద్ర, శిరీష పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు సిబ్బందిపై దాడి

సైదాపురం: మండలంలోని చాగణం పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సిబ్బందిపై గురువారం రాత్రి పొదలకూరు మండలంలోని డేగపూడికి చెందిన కుమ్మరగుంట సిసింద్రి దాడి చేశాడు. ఆఫీసు అద్దాలు పగులగొట్టాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చాగణం పెట్రోల్ బంకులో పంప్‌బాయ్‌గా సిద్దు పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆఫీసులో నిద్రకు ఉపక్రమించాడు. 11.30 గంటల ప్రాంతంలో పొదలకూరు మండలంలోని డేగపూడి గ్రామానికి చెందిన కుమ్మరగుంట సిసింద్రి అక్కడికి వచ్చాడు. ఎంత సేపు నిద్ర లేపాలి అంటూ కేకలు వేశాడు. అంతటి ఆగకుండా ఆఫీసు అద్దాలు పగులగొట్టాడు. అడ్డు వచ్చిన సిద్దుపైనా దాడి చేశాడు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో హోమం



చిల్లకూరు: పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

చిల్లకూరు : గూడూరు బజారు వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం హోమం చేసి పూర్ణాహుతి సమర్పించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

కోట: స్థానిక తూర్పువీధిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ ప్రతిష్టాపన, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



అమ్మవారి కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

ముక్కు మూసుకోవాల్సిందే!

- రోడ్డుపైకి వస్తున్న చెత్త కుప్పలు
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



రోడ్డును కమ్మేసిన చెత్త కుప్పలు

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీధుల్లో సేకరించే చెత్తను చల్లకాలువ ప్రాంతంలోని డంపింగ్ యార్డుకు తరలించకుండా రోడ్డుపైనే వేస్తున్నారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోందని చల్ల కాలువ మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు వాపోతున్నారు. గతంలో చల్ల కాలువ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డుకు చెత్తను తరలించేవారు. పక్కనే హిందూ శ్మశానవాటిక ఉండడంతో కర్మక్రియల కోసం అక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గమనించిన గత ప్రభుత్వం డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా నిలిపి వేసి గుంటూరులోని చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే పరిశ్రమకు తరలించేలా చర్యలు తీసుకుంది. అంతేగాక యార్డుకు పక్కనే కోర్టులో పెండింగ్‌లో ఉన్న 13 ఎకరాల స్థలాన్ని క్లియర్ చేసి అక్కడికి చెత్త తరలించేలా ఏర్పాట్లు చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాక్టర్లు దిగబడి పోతున్నాయనే కారణంతో సిబ్బంది యార్డు లోపలికి వెళ్లకుండా రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. చెత్త కుప్పలు రోడ్డుపైకి వస్తుండడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే చెత్త నుంచి వెలువడే దుర్గంధంతో ముక్కు మూసుకునే పరిస్థితి. ఈ విషయాన్ని పలువురు మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ విషయంపై గూడూరు మున్సిపల్ కమిషనర్ వివరణ కోరగా చెత్తను డంపింగ్ యార్డులోకి తీసుకువెళ్లకుండా పక్కనే వేస్తున్నట్టు తనకు తెలియదన్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.



డంపింగ్ యార్డులోకి వెళ్లే దారి

దుమ్ము రేపుతున్నారు



చేడిమాల వద్ద వాహనాలతో లేస్తున్న దుమ్ము

చిల్లకూరు : మండలంలోని వరగలి రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. ఒక వైపు సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద టిప్పర్లతో మట్టి, గ్రావెల్ తరలిస్తున్నారు. మరోవైపు తీర ప్రాంతంలోని పరిశ్రమలకు సరుకులు తరలించేందుకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డుపై పూర్తిగా రాళ్లు తేలి దుమ్ము రేగుతోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఈ రోడ్డులో ప్రయాణించే సమయంలో దుమ్ముకు కళ్లు కనిపించక అదుపుతప్పి పడిపోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. గత ప్రభుత్వం రోడ్డు మరమ్మతుల కోసం రూ.75 లక్షలు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరమ్మతు పనులు చేపట్టారు. సుమారు 9 కిలోమీటర్ల మేర పనులు చేయాల్సి ఉండగా రెండు కిలోమీటర్లు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో వర్షాలకు మరో సారి చేసిన పనులు కూడా దుమ్ములో కలిసి పోయి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుమ్ము కొట్టుకుపోతున్నారు.



వరగలి రహదారిపై దుమ్మురేపుతున్న వాహనాలు

గిరిజనులపై కక్ష సాధింపు తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, గిరిజనులు

- యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన
- గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల పరిశీలన

సైదాపురం: గిరిజనులపై కక్షసాధింపు చర్యలు తగదని, వారి జోలికి వస్తే సహించేదిలేదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. అనంతరం గిరిజనులతో కలిసి సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కమ్మవారిపల్లిలో గిరిజనులు 16 ఏళ్లుగా నిమ్మ తోటలను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఒక భూస్వామి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గిరిజనులకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అమాయకులైన గిరిజనులపై అన్యాయంగా కేసులను నమోదు చేస్తున్నారని నిలదీశారు. కేసులను వెనక్కి తీసుకోవాలని, గిరిజనుడైన శివయ్య ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జున, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నేతలు మల్లి, నాగరాజు, రమేష్, మాజీ జెడ్పీటీసీ ఏకొల్లు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం


- నెరవేరిన మన్నూరు, మన్నూరుమిట్ట గ్రామస్తుల కల
- నేదురుమల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైనం



నేరేడు కాలువపై ఎంపీ నిధులతో నిర్మించిన బ్రిడ్జి


బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని పాత మన్నూరు గ్రామం, మన్నూరు మిట్ట రెండు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నేరేడు వాగుతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. మన్నూరు పాత గ్రామం మండల కేంద్రమైన బాలాయపల్లికి రావాలంటే గొల్లపల్లి మీదుగా సుమారు 12 కిలోమీటర్లు తిరిగి చేరుకోవాలి. ఈ విషయాన్ని స్థానికులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన తిరుపతి ఎంపీ గురుమూర్తికి సమస్యను వివరించారు. రెండు గ్రామాలకు కనెక్టివిటీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ఎంపీ రూ.39 లక్షలు మంజూరుచేశారు. టెండర్ల అనంతరం బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మన్నూరు పాత గ్రామం, మన్నూరు కొత్త గ్రామాలకు రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంల సేవలు మరువలేనివి



రాపూరు : గోనుపల్లి హెచ్‌ఎం నాగేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న రామలింగం

రాపూరు : మండలంలోని గోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేంద్రకుమార్ సేవలు మరువలేనివని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రామలింగం తెలిపారు. నాగేంద్రకుమార్ శుక్రవారం ఉద్యోగ విమరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రామలింగం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గోనుపల్లిలో పాఠశాల అభివృద్ధికి నాగేంద్రకుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసులు, జిలాని, పలు పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.



చిల్లకూరు : హెచ్‌ఎం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

హెచ్‌ఎంకు ఘన సన్మానం

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్ సేవలు అనిర్వచనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మధుకర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సుధాకర్ ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, కామేశ్వరి, వీవీకుమార్, చంద్రశేఖర్, మంజుశ్రీ, సురేంద్ర, మస్తానమ్మ, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

'రవీంద్రబాబు నిబద్ధతతో పనిచేశారు'

చిల్లకూరు: పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.రవీంద్రబాబు నిబద్ధతతో పనిచేశారని ఇంజినీర్స్ యూనియన్ అధ్యక్షుడు మురళీక్రిష్ణమనాయుడు కొనియాడారు. డి.రవీంద్రబాబు గూడూరు పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. మురళీక్రిష్ణమనాయుడు, డిప్లొమా ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియజ్ అహ్మద్ మాట్లాడుతూ కింది స్థాయి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రవీంద్రబాబు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో శంకర నారాయణ, కాంతారావు, గిరినాథ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈఈ రవీంద్రబాబును సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

నేడు, రేపు బాలికల కబడ్డీ టోర్నమెంట్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో శని, ఆదివారాలు పోలీసుశాఖ ఆధ్వర్యంలో బాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 16 ఏళ్లలోపు బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, షీల్డులు అందజేస్తామని తెలిపారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

చిట్టమూరు : మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీపై ఎంపీడీవో మనోహర్ గౌడ్ గ్రామ సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 5.30 గంటలకే పింఛను పంపిణీని ప్రారంభించాలన్నారు. లబ్ధిదారుల ఇంటికే నగదు అందజేయాలని సూచించారు. అందరినీ ఒకచోటుకు రమ్మని చెప్పవద్దన్నారు. పింఛను మొత్తం ఇచ్చిన తర్వాత జియో ట్యాగింగ్ చేయాలన్నారు. మండలంలో మొత్తం 5,799 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు.

హత్య కేసులో విచారణ ముమ్మరం

కోట : మండలంలోని జరుగుమల్లిలో జరిగిన వ్యక్తి హత్య కేసును దర్యాప్తు ముమ్మరం చేసినట్టు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం గ్రామానికి చేరుకుని హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. హత్యకు దారితీసిన కారణాలపై విచారించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాష, ఎస్‌ఐ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా

కోట: మండల పరిధిలోని కొండుగుంట వద్ద ప్రధాన రహదారిపై మినీలారీ బోల్తాపడిన ఘటనలో 600 బాతులు మృతి చెందాయి. బాతుల పెంపకందారులు గూడూరు నుంచి కోటకు బాతులను మినీ లారీలో తరలిస్తున్న క్రమంలో లారీ అదుపు తప్పి బోల్తాపడింది. లారీలో మొత్తం 800 వరకు బాతులు తీసుకెవెళ్తుండగా అందులో 600 బాతులు మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ఓజిలి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.స్వప్న హెచ్చరించారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం సేవించే వారిపై నిఘా ఉంచుతామన్నారు. షాపుల వద్ద మద్యం సేవించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం ఓజిలి గ్రామంలోని పామాయిల్ పరిశ్రమ సమీపంలో మందుబాబులు వేసిన సీసాలు, వాటర్ బాటిళ్లు, గ్లాసులను తొలగించారు.

లారీ ఢీకొని నలుగురికి గాయాలు

కోట : మండలంలోని వీరారెడ్డిసత్రం వద్ద శుక్రవారం బైక్‌ను లారీ ఢీకొంది. దీంతో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తిమ్మనాయుడుపాళెం ఎస్టీ కాలనీకి చెందిన శశిధర్, ప్రశాంతి దంపతులు, కాలనీకి చెందిన అక్షయ, రాణి బైక్‌లో సూళ్లూరుపేటకు బయలుదేరారు. వీరారెడ్డి సత్రం వద్ద లారీ ఢీకొంది. నలుగురు గాయపడ్డారు. వారిని అక్కడే వున్న కోట పోలీసు కానిస్టేబుల్ రమేష్ ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రశాంతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు నెల్లూరుకు రెఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి..



భాస్కర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ సిరాజ్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం మునిరత్నం నగర్ సమీపంలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన మల్లాపు భాస్కర్ బైక్‌లో బిరదవాడ నుంచి నాయుడుపేట వస్తున్నాడు. మునిరత్నం నగర్ సమీపంలో జాతీయ రహదారిపై తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న హైవే ఏఆర్ కానిస్టేబుల్ సిరాజ్ అక్కడికి చేరుకుని అతన్ని హైవే పోలీస్ మొబైల్ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా లారీ బోల్తా



రాపూరు: మండలంలోని రాపూరు-వెంకటగిరి జాతీయ రహదారిలోని సిద్ధవరం తెలుగు గంగ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం యూరియా లారీ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. లారీ యూరియాను తీసుకుని నెల్లూరు జిల్లా కోవూరు నుంచి వెంకటగిరికి బయలుదేరింది. రాపూరు మండలం సిద్ధవరం సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద ఉన్న మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. యూరియా బస్తాలు కిందపడిపోయాయి. డ్రైవర్ మహబూబ్ బాషాకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని 25 వార్డులకు సంబంధించి బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలు 88 యూనిట్లు మంజూరయ్యాయని, కమ్యూనిటీల వారిగా ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ చిన్నయ్య తెలిపారు. బీసీ–ఏకి 29, బీసీ–బీకి 14, బీసీ–డీకి 10, బీసీ–ఈకి 8, ఈబీసీకి 4, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ఒక్కొక్కటి, రెడ్డికి 2, కమ్మకు 3, కాపులకు 15 యూనిట్లు ఉన్నట్టు తెలిపారు. యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణం ఉంటుందని తెలిపారు. యూనిట్ విలువ రూ.1.50 లక్షల నుంచి రూ.8 లక్షలు వరకు వుంటుందని తెలిపారు. అర్హులైన వారు apobmmr.apcfrr.in వెబ్‌సైట్‌లో ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కుల ధృవీకరణ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్, ఫోన్ నంబర్ అవసరమవుతాయని వెల్లడించారు.

ఘనంగా స్పేస్ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవం



స్పేస్ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్, అతిథులు

సూళ్లూరుపేట : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన స్పేస్ సెంట్రల్ స్కూల్‌లో 51వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో తిరుపతి ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ సంతాను భట్టాచార్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజరాజన్ మాట్లాడుతూ శ్రీహరికోట, కేఆర్‌పీ, డీవోఎస్ కాలనీల్లోని పిల్లల కోసం స్కూళ్లు ఏర్పాటు చేసి ఉన్నత ప్రమాణాలతో విద్య అందిస్తున్నట్టు తెలిపారు. సంతాను భట్టాచార్య మాట్లాడుతూ స్పేస్ సెంట్రల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో వున్నారని తెలిపారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఏ సయీద్ హమీద్, స్కూల్ అడ్వయిజర్ కమిటీ చైర్మన్ ఎ ముత్తు చైజియన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

డక్కిలి/చిట్టమూరు : ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డక్కిలి, చిట్టమూరు తహసీల్దార్లు ఎం.శ్రీనివాసులు, వి.విజయలక్ష్మి తెలిపారు. డక్కిలి మండలం వెంబులూరు ఎస్టీ కాలనీ, చిట్టమూరు మండలం గునపాడు గ్రామాల్లో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డక్కిలి ఏపీఎం జమునారాణి, చిట్టమూరు జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ కూరపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

కోట : స్థానిక కోటమ్మగుడి కాలనీకి చెందిన ప్రగతి అనే మహిళపై శుక్రవారం కొంతమంది దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని సమీప బంధువులైన లక్ష్మీ, మరో పదిమంది కలిసి ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రగతిపై దాడి చేసినట్టు ఆమె భర్త శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.